క్లుప్తంగా

ఎమ్మెల్సీని కలిసిన బీర్‌పూర్ ఎస్సై



ఎమ్మెల్సీకి మొక్క ఇస్తున్న ఎస్సై కుమారస్వామి

జగిత్యాలక్రైం: బీర్‌పూర్ మండల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కుమారస్వామి శుక్రవారం ఉదయం జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అశ్విని

కోరుట్ల: భారతీయ న్యాయ సంహిత నూతన చట్టాలపై పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత కేంద్రం జగిత్యాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళా సాధికారత, నూతన చట్టాలు, భారతీయ న్యాయ సంహిత 2023 లో పొందుపర్చిన మహిళలు, ఆడపిల్లపై జరుగుతున్న హింస. మహిళా హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత జిల్లా కో ఆర్డినేటర్ అశ్విని, సఖి జిల్లా న్యాయ కౌన్సిలర్ లావణ్య, న్యాయవాది కటుకం రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజు, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు గిరిజన నాయకుల వినతి



వినతిపత్రం ఇస్తున్న గిరిజన నాయకులు

కథలాపూర్: శ్రీ సంత్ సేవాల్ మహారాజ్ ఆలయం, మండల గిరిజన సంఘం భవనం కోసం 5 గుంటల స్థలం కేటాయించాలని శుక్రవారం గిరిజన నాయకులు తహసీల్దార్ ముంతాజిబొద్దీన్‌కు వినతిపత్రం అందించారు. భవనం లేకపోవడంతో చెట్ల కింద సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. ప్రభుత్వం తరుపున స్థలం కేటాయిస్తే తాము భవనం నిర్మించుకుంటామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండలాధ్యక్షుడు గుగ్లొత్ రవినాయక్, మండల ప్రతినిధులు ప్రకాశ్‌నాయక్, దేవదాస్, రాంసింగ్, పరమేశ్, లోక్యనాయక్, హర్సింగ్, రాజు పాల్గొన్నారు.

పంటపొలాల్లో క్షేత్ర స్థాయి పర్యటన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండల వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేనంబర్ల వారిగా పంటపొలాల వివరాలు సేకరిస్తున్నారు. శుక్రవారం వల్లంపల్లి, లింగంపల్లి గ్రామాల్లో ఏయే సర్వే నంబర్లలో రైతులు ఏ పంటలు వేశారని వివరాలు నమోదు చేసుకున్నారు. మొక్కజొన్నలో కలుపుతీస్తున్న రైతుల వద్దకి వెళ్లి చీడపీడల గురించి అవగాహన కల్పించారు. రైతులకు ఏవైనా సందేహాలుంటే నేరుగా అధికారులతో నివృత్తి చేసుకోవచ్చనారు. కార్యక్రమంలో ఏవో చంద్రదీపక్, విస్తరణ అధికారి సురేందర్, నరేందర్, రైతులు పాల్గొన్నారు.

పేద యువతి వైద్యానికి ఆర్థికసాయం

కోరుట్లటౌన్: పట్టణంలోని మోతుకూరి నవ్య అనే పేద యువతికి వైద్యం కోసం మహిళా లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు పోతని శ్రీలత, సెక్రటరీ పొలాస గీత శుక్రవారం రూ.11,500 ఆర్థికసాయం అందజేశారు. నవ్య తల్లిదండ్రులు గతంలో కరోనాతో మృతి చెందారు. ఇటీవల నవ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్యానికి డబ్బులు లేకపోవడంతో మహిళా లయన్స్‌క్లబ్ సభ్యులు ఆర్థికసాయంతో పాటు ఒక నెలకు సరిపడా కిరాణ సామగ్రి అందజేశారు. రూ.10 వేలు ఆర్థిక సాయం చేసిన దాసరి స్వప్నారెడ్డిని లయన్స్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ పోతని ప్రవీణ్, జోన్ చైర్మన్ ఆడెపు కమల, వనపర్తి రమ్య, కుందారపు ప్రేమలత, రుద్ర సుజాత పాల్గొన్నారు.



ప్రారంభించారు.. తాళమేశారు..

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో గత నెల 28న ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు కార్యాలయానికి తాళం వేసే ఉంచుతున్నారు. కార్యాలయానికి సిబ్బంది ఎవ్వరూ రాకపోవడంతో అసలు కార్యాలయం ఉందా లేదా అని రైతులు, గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కార్యాలయంలో డీఈ, ఏఈ, లస్కర్లు ప్రతిరోజు ఉండాల్సి ఉండగా, కార్యాలయానికి తాళం కూడా తీయడం లేదు. ఇప్పటికైనా కార్యాలయానికి తాళం తీసి, సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆదమరిస్తే అంతే..!

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పాటిమీద తండా వద్ద కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఆత్మకూర్-పాటిమీది తండా మధ్యలో కల్వర్టు వద్ద రహదారిపై మట్టి కొట్టుకుపోయింది. గతేదాది కురిసిన వర్షాలతో ఓ వైపు మట్టి కొట్టుకుపోగా ఇప్పటివరకు అక్కడ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వాహనదారులు ఏ మాత్రం అదమరిచినా పడిపోయే ప్రమాదం ఉంది.

వార్డు సమస్యల పరిష్కారానికి కృషి



కోరుట్ల: పట్టణంలో డ్రైయినేజీలు, కల్వర్టులు, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. పట్టణంలోని 16వ వార్డును స్థానిక కౌన్సిలర్ బలిజ పద్మతో కలిసి శుక్రవారం సందర్శించారు. వార్డులో సీసీ రోడ్లు, మురికి కాల్వలు, ర్యాంప్‌ల మరమ్మతుకు నిధులు కేటాయించాలని కౌన్సిలర్ కోరగా ప్రభుత్వం నుంచి నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఓరియంటల్ తెలుగు కళాశాలకు పూర్వ వైభవం

- కళాశాల నిర్వాహణకు రూ.32 లక్షలు మంజూరు
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ఓరియంటల్ సంస్కృతాంధ్ర తెలుగు కళాశాలకు పూర్వ వైభవం లభించిందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. 60 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మినరసింహ సంస్కృతాంధ్ర ఓరింటల్ కళాశాలలో విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు తెలుగు ఉపాధ్యాయులు, లెక్చరర్లుగా, కవులు, కళాకారులుగా గుర్తింపు పొందారని, ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన ఈ తెలుగు కళాశాల గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని వసతులతో కళాశాలను పునఃప్రారంబిస్తామని తెలిపారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన జీవోను కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, కరస్పాండెంట్ రామకిష్టయ్యలకు విప్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్, కుంట సుధాకర్, రాందేని మొగిలి, చిలుముల లక్ష్మణ్, అసెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ఫీజులను నియంత్రించాలని ప్రభుత్వ విప్‌కు వినతి

గొల్లపల్లి: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని శుక్రవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో బుక్స్, యూనిఫామ్‌లతో దగా చేస్తున్నారని, వాహనాలకు ఫిట్‌నెస్ లేని వాహనాలు నడుపుతూ పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి

జగిత్యాల: చేనేత హస్తకళలను అందరూ ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శుక్రవారం జగిత్యాల టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళలు, హ్యాండ్‌క్రాఫ్స్, హ్యాండ్లూమ్ స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత హస్తకళలు పురాతనమైనవి, విభిన్న రూపాల్లో సాంప్రదాయాలను దాటే హస్తకళలను అందరు ప్రోత్సహించి ఆదరించాలన్నారు. ఈ ఉత్పత్తులు ఎంతో ఆకట్టుకుంటున్నాయని, ప్రతి ఒక్కరు ప్రదర్శనలను సందర్శించి ఉత్పత్తులు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.



హస్తకళల స్టోర్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఎమ్మెల్యేతో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

జగిత్యాల:నాయీ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పెండెం మహేందర్, ఉపాధ్యక్షుడు గంగరాజం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మత్రిపల్లి సాగర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అగ్నిమాపక శాఖ ఎస్సై

జగిత్యాలరూరల్: జగిత్యాల అగ్నిమాపక శాఖ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కృష్ణకాంత్ శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

పరామర్శ

మండలంలోని హన్మాజీపేట గ్రామానికి చెందిన నారవేని రాయలింగు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బొడ్డు దామోదర్, సురేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలి

మెట్‌పల్లి: హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని సంఘం రాష్ట్ర కార్యదర్శి తోకల రాజేశ్వర్ అన్నారు. పట్టణంలో శుక్రవారం మాట్లాడారు. గతంలో ఈటల రాజేందర్‌ను పలుమార్లు అవమానించిన కౌశిక్‌రెడ్డి.. రెండు రోజుల క్రితం చిగురుమామిడి జెడ్పీటీసీ రవీందర్‌ను అసభ్య పదజాలంతో దూషించారన్నారు. ఆయన వైఖరి పట్ల ముదిరాజ్ వర్గమంతా ఆగ్రహంతో ఉందని, వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో చొప్పరి అంజయ్య, రేండ్ల రమేశ్, జంగిటి అంజయ్య, తోకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్టు

కోరుట్ల: బీజేవైఎం రాష్ట్ర కమిటీ పిలుపుతో టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న కోరుట్ల బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి బీజేవైఎం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు.కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలాల సాయిచంద్, ప్రదాన కార్యదర్శి మత్రిపల్లి నవీన్, గుండేటి సాయి కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి బీజేవైఎం నాయకులు తరలివెళ్లకుండా కథలాపూర్ మండలంలోని నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు కాసోజి ప్రతాప్, మామిడిపెల్లి ప్రవీణ్, ముంజ వెంకటేశ్ ఉన్నారు.

మొక్కజొన్న పంటల పరిశీలన

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో మొక్కజొన్న పంటను శుక్రవారం మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మొక్కజొన్నలో కత్తెరపురుగు, సూక్ష్మదాతు లోపాన్ని గమనించి తీసుకోవాల్సిన చర్యలు రైతులకు వివరించారు. ఆయన వెంట ఏఈవో రాజేశ్, రైతు అనంతస్వామి, శంకర్, సోమయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రాయికల్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు దాసరి రామస్వామి, బందెల శ్రీనివాస్, కార్తీక్, గంగరాజం, సామల్ల గంగాధర్, తిరుమల శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను స్థానిక నాయకులు, తోటి ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.కార్యక్రమంలో ఎంఈవో, హెచ్‌ఎం నరేశం, మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేష్ గౌడ్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

జగిత్యాలరూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కండ్లపలి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగసుధారాణి అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ధర్మపురి (బుగ్గారం): బుగ్గారం మండల కేంద్రంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ ఆధ్వర్యంలో డ్రెయినేజీలో పూడిక తీత చెత్తా చెదారాలు, మురికి నీటి గుంటల్లో నీరు నిలువకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ధర్మపురి: పట్టణంలోని న్యూ హరిజన వాడ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ధర్మపురికి చెందిన చాడ హరికృష్ణ రమ్య దంపతుల ఆధ్వర్యంలో రూ.12 వేల విలువ గల నోటు పుస్తకాలను, అంగన్‌వాడీ పిల్లలకు పలుకలు పంపిణీ చేశారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

ఇబ్రహీంపట్నం: అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు ఎంపీవో కృపాకర్ అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని వేములకుర్తిలో ఫ్రైడే డ్రై డే సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు చెత్త చెదారం లేకుండా తొలగించాలని, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లుతూ దోమలమందును పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మనోజ్, కారోబార్ రతన్, సిబ్బంది గంగాధర్, ఆశలు శారద, వీవోఏలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట దున్నేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: పొలాల్లో పచ్చిరొట్ట కలియ దున్నేటప్పుడు రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో దీపిక తెలిపారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో పచ్చిరొట్ట సాగును పరిశీలించారు. పచ్చిరొట్ట పైరు కాలం 60 నుంచి 70 రోజులు ఉంటుందని, సాగు చేసిన 45 నుంచి 50 రోజులకు పూత దశలో ఉన్నప్పుడు పచ్చిరొట్ట పైరును కలియదున్ని 15 రోజుల పాటు నేలలో కుళ్లనిస్తే పంటకు సేంద్రియ ఎరువుగా మారుతుంది. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ అబ్బిడి రాజరెడ్డి , రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

గొల్లపల్లి: మండల ప్రత్యేకాధికారిగా సాయిబాబా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిరంతర పారిశుధ్యంతో స్వచ్ఛ గ్రామాలు

మల్లాపూర్: గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలతో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీవో జగదీశ్ అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేటలో శుక్రవారం పర్యటించి నిల్వనీటిని తొలగించి, చేతులు కడుక్కొవడంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్, ఏఎన్‌ఎం కోమల, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి మున్సిపల్ చైర్మన్ సన్మానం

రాయికల్: మాజీ ఎంపీపీ లావుడ్య సంధ్యారాణిని శుక్రవారం మండలంలోని తాట్లవాయిలో మున్సిపల్ చైర్మన్ మోరహన్మండ్లు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి ఘనంగా సన్మానించారు. ఎంపీపీగా ఐదేళ్లకాలంలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పంటల సాగు పై సర్వే

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో రైతులు ఏఏ పంటలు సాగు చేస్తున్నారే విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. సర్వే నెంబర్ల వారీగా రైతులు ఏ పంటలు సాగు చేస్తున్నారు? ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు? అనే విషయాలు సేకరించారు. మండలంలోని రైతులు ఎక్కువగా మొక్కజొన్న, పసుపు పంటలు సాగు చేసినట్లు రికార్డుల్లో నమోదైంది. సాగు చేసిన పంటల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఏఈవోలు ఎం.డీ ఫమీనా, శేఖర్ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

జగిత్యాలటౌన్: జూలై 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం మాదిగ పిలుపునిచ్చారు. దుమాల గంగారం అధ్యక్షతన శుక్రవారం పట్టణంలోని జై భీంనగర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం గంగారాం మాట్లాడుతూ ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాదించేవరకు మందకృష్ణ నాయకత్వంలో పోరాటం సాగుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు బొల్లారపు దివాకర్, నురుగు శ్రీనివాస్, బెజ్జంకి సతీష్ మాదిగ, భువనగిరి కిషన్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ దీక్షా కరపత్రం ఆవిష్కరణ

కోరుట్ల రూరల్: టీఎస్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈ నెల 7 న చేపట్టే దీక్షా కరపత్రంను శుక్రవారం మండలంలోని కల్లూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనతడుపుల అంజయ్య మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని దీక్ష చేపడుతున్నట్టు అంజయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాధర నరేశ్, శివ గంగారాం, లక్ష్మణ్, ఆదర్శ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'అమ్మ పేరిట ఒక మొక్క'

కథలాపూర్: మండలంలోని సిరికొండలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమం నిర్వహించారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి బీజేపీ నాయకులతో కలిసి ఇంటికి ఒక మొక్క నాటారు. కార్యక్రమంలో సిరిమల్లె రాజశేఖర్, ఆల్గొట్ ప్రమోద్, కొడిపెల్లి అనిల్‌రెడ్డి, ముంజ వెంకటేశ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల చదునుపై ఫిర్యాదు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట చిన్నగుట్ట వెనుక భాగంలోని ప్రభుత్వ భూములను చదును చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు. ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ అధికారులను కలిసి సమస్యపై శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఏడీబీ తండాకు చెందిన కొందరు వ్యక్తులు చెట్లను నరికివేసి భూములను చదును చేసినట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కబ్జా చేయాలనే ఈ చర్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ,గంగాధర్, రమేశ్, రాజేశం, రాజారెడ్డి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్' నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

జగిత్యాల: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6–10వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి 2024–25 సంవత్సరానికి గాను ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 1 నుంచి ప్రారంభమైందని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. నామినేషన్లు వేయు విధానంపై ఎస్‌ఈఈఆర్టీ హైదరాబాద్ వారు ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఈనెల 6న (శనివారం) ఉదయం 11–12 గంటల వరకు ఈసాట్ నిపుణి ద్వారా శిక్షణ కార్యక్రమం ప్రసారం కానుందని తెలిపారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దీనిపై అవగాహన కల్పించి నామినేషన్లు ఎక్కువ వచ్చేలా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్: మండలంలోని వీరాపూర్, ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ హరీశ్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీశ్రీ కళావేదిక జాతీయ యువజన ఉపాధ్యక్షుడిగా చోళేశ్వరచారి

గొల్లపల్లి: మండలంలోని రాఘవపట్నంకు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు చోళేశ్వరచారి శ్రీశ్రీ కళావేదిక జాతీయ యువజన ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తికొండ ప్రతాప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడుతూ యువ కళాకారులను వెలికితీసేలా కృషి చేస్తానన్నారు. ఆయన నియమకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడిగా రత్నం

ఇబ్రహీంపట్నం: మండల ఫొటో,వీడియోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన ఏసురత్నంను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండలకేంద్ర శివారులోని వెంకటేశ్వర కల్యాణమండపంలోనూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బొబ్బిల అక్షయ్, కార్యదర్శిగా మత్రిపెల్లి మురళి, కోశాధికారిగా బండారి రాఘవేంద్రను ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

రెడ్డి సంఘం ఉమ్మడి మండల అధ్యక్షుడిగా నరసింహారెడ్డి

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండల రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నోముల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మిట్టపల్లి రాజారెడ్డి, కోశాధికారిగా కాలగిరి రాజేందర్, కార్యవర్గ సభ్యులుగా ఏనుగు రమేష్ రెడ్డి, అన్నాడి జలపతి రెడ్డి, ఏనుగు నర్సింహ రెడ్డి, కాటిపల్లి దశరథ రెడ్డి, అక్కిరెడ్డి తిరుపతిరెడ్డిను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేస్తానన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బసవేశ్వరస్వామి విగ్రహం సమీపంలో శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వారి నుంచి రూ.26 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుడుంబా పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ తండాలో శుక్రవారం పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు గుడుంబా స్థావరంపై దాడులు చేశారు. గుడుంబా స్థావరంలో 6 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, 90 లీటర్ల బెల్లం పానకం, గుడుంబా పాత్రలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారు చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వినోద్ రాథోడ్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

సారంగాపూర్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి శుక్రవారం అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం.. సదరు యువతి మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి

మల్లాపూర్: ఆరోగ్యకరమైన సమాజంతోనే దేశాభివృద్ధి చెందుతుందని, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని ముత్యంపేటలో స్థానిక రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులుపాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి పూర్తిచేసుకున్న పొరండ్ల గ్రామానికి చెందిన పర్స మనీషా బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా, పొరండ్ల ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థినిని ఘనంగా సన్మానించారు.